సాక్షి పెద్దపల్లి

మంగళవారం । 31 । అక్టోబర్ । 2023





పోలీసు బలగాల కవాతు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తామని, ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటుహక్కు వినియోగించుకుంటామనే భరోసా కల్పించేందుకు కేంద్ర పోలీసు బలగాలతో కవాతు నిర్వహిస్తున్నామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. డీసీపీ చేతన, పెద్దపల్లి రిటర్నింగ్ అధికారి మధుమోహన్‌తో కలిసి జిల్లా కేంద్రంలో సోమవారం చేపట్టిన పోలీసు కవాతులో కలెక్టర్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న జడ్జి ప్రియాంక

సుల్తానాబాద్(పెద్దపల్లి): చట్టాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని జడ్జి ప్రియాంక అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో జడ్జి మాట్లాడారు. తమ పిల్లలు భవిష్యత్‌లో ఉన్నతంగా ఎదగాలనే ఆకాంక్షతో తల్లిదండ్రులు కళాశాలలకు పంపిస్తున్నారని, వారి కలలు నెరవేర్చాలని సూచించారు. ప్రిన్సిపాల్ శ్రీధర్‌రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలకిషన్‌ప్రసాద్, సభ్యులు శ్రీనివాసరావు, లక్ష్మీకాంతరెడ్డి ఏజీపీ తిరుపతిరెడ్డి, న్యాయవాదులు రమేశ్, భూమయ్య, రవీందర్, శ్యాంసుందర్, శ్రీరాములు, శివ, దివాకర్‌రావు ఉన్నారు.

నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఆర్వో అరుణశ్రీ

జ్యోతినగర్(రామగుండం): ఎన్నికల నియమావళిని అందరూ పాటించాలని రామగుండం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.అరుణశ్రీ సూచించారు. ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్ ఉద్యోగ వికాస కేంద్రం ఆడిటోరియంలో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు సోమవారం ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఓటర్లు తమ ఓటు వేయడానికి బ్యాలెట్ యూనిట్ ఓటింగ్ కంపార్ట్‌మెంట్‌లో ఉంటుందని అన్నారు. పోలింగ్ అధికారి గుర్తింపును ధ్రువీకరిస్తారని చెప్పారు. ఈసందర్భంగా మాస్టర్ ట్రైనర్స్ ద్వారా శిక్షణ ఇచ్చారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, రామగుండం, అంతర్గాం, పాలకుర్తి తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

లోకో పైలెట్ల నిరసన



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

రామగుండం: కేంద్ర రైల్వే బోర్డు నియమించిన హైపవర్ కమిటీ రూపొందించిన రన్నింగ్ స్టాఫ్ రెస్ట్ రూల్స్ మార్పు చేయకపోవడం శోచనీయమని ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ నిరసన వ్యక్తం చేసింది. సోమవారం ఏఐఎల్ఆర్ఎ ఆధ్వర్యంలో స్థానిక రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారంపై హైపవర్ కమిటీ ఉత్తర్వులు దహనం చేసింది. లోకో పైలెట్ల సమస్యలు పరిష్కరించాలని దశలవారీగా ఆందోళనలు చేశామని గుర్తుచేశారు. లోకో పైలెట్లు సీహెచ్ రవి, వినయ్, వంశీ, రంజిత్, సౌరభ్ పాల్గొన్నారు.

రాజకీయ నేతలతో సమావేశం



సూచనలిస్తున్న ఆర్డీవో హనుమా నాయక్

మంథని: స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆర్డీవో హనుమా నాయక్ సమావేశమయ్యారు. అసెంబ్లీ ఎన్నికల నామినేషన్, పాటించాల్సిన నియమావళి గురించి వివరించారు. తహసీల్దార్ రాజయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యం




లక్ష్మణ్‌కు కండువా కప్పుతున్న రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాకూర్ కోరారు. సోమవారం బీఆర్ఎస్ నాయకుడు లక్కాకుల లక్ష్మణ్, పలువురు కాంగ్రెస్‌లో చేరగా వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ ఆరుగ్యారంటీల ఫలాలను పేదల దరిచేర్చామన్నారు. లక్ష్మణ్ మాట్లాడుతూ చందర్‌ను ఎమ్మెల్యేగా గెలిపించేందుకు తనవంతుగా రెండు నెలల జీతం రూ.50 వేలు ఇచ్చానన్నారు. ఎమ్మెల్యేగా గెలిచాక చందర్ పట్టించుకోలేదని ఆరోపించారు. నాయకులు తాత ఐలయ్యయాదవ్, ములుగు భీమయ్య, పొన్నాల శ్రీనివాస్, శోభన్‌బాబు, చిలుముల చంద్రయ్య, కె.లక్ష్మయ్య, బండారు మల్లయ్య, అంజయ్య, మొగిలి, శేఖర్, ఎస్.వెంకటేశం పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగు చేయండి

ఎలిగేడు/సుల్తానాబాద్(పెద్దపల్లి): ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి సూచించారు. ధూళికట్ట, గర్రెపల్లి రైతువేదికల్లో సోమవారం రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై శిక్షణ ఇచ్చారు.



ప్రజలను మోసం చేయడం కన్నా.. ఎన్నికల్లో ఓడిపోవడం మేలు
– స్టీవెన్‌సన్

మీకు తెలుసా?

అంతర్గాం నుంచి నలుగురు ఎమ్మెల్యేలు

జగిత్యాలరూరల్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే రాజకీయాలకు జగిత్యాల జిల్లాలోని అంతర్గాం గ్రామం పెట్టింది పేరు. జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం గ్రామానికి చెందిన మాకునూరి ధర్మారావు 1962లో జగిత్యాల ఎమ్మెల్యేగా గెలుపొందారు. అలాగే 1985లో గొడిశెల రాజేశంగౌడ్, ఇదే గ్రామానికి చెందిన సుద్దాల దేవయ్య 1985లో చొప్పదండి ఎమ్మెల్యేగా, 2018లో జగిత్యాల ఎమ్మెల్యేగా మాకునూరి సంజయ్‌కుమార్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు.



మాకునూరి ధర్మారావు



రాజేశంగౌడ్




సుద్దాల దేవయ్య



సంజయ్‌కుమార్

ఓటు.. సత్యాగ్రహం ఈ రెండూ ప్రజల చేతిలో ఉన్న ఆయుధాలు
– మహాత్మ గాంధీ



స్వతంత్రుల కార్మికక్షేత్రం

మేడారం నుంచి రామగుండం దాకా..

- రామగుండం పారిశ్రామిక ప్రాంతం గతంలో మేడారం(ఎస్సీ) అసెంబ్లీ నియోజకవర్గంలో ఉండేది.
- నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా రామగుండం కార్పొరేషన్‌తోపాటు పాలకుర్తి, అంతర్గాం, రామగుండం మండలాలను కలుపుకుని 2009లో రామగుండం(జనరల్) 23వ అసెంబ్లీ నియోజకవర్గంగా ఆవిర్భవించింది.
- గోదావరిఖని కార్మిక క్షేత్రం ప్రధాన కేంద్రంగా ఏర్పడింది.
- రామగుండం, అంతర్గాం, పాలకుర్తి మండలాల్లోని 266 గ్రామాలు, రామగుండం కార్పొరేషన్‌లోని 50 డివిజన్లు అసెంబ్లీ పరిధిలోకి వచ్చాయి.
- సింగరేణి, ఎన్టీపీసీ, ఏపీ జెన్‌కో, కేశోరామ్ సిమెంట్, ఆర్ఎఫ్‌సీఎల్ పరిశ్రమలు ఇక్కడి ప్రత్యేకత.
- సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు, వారికుటుంబాల ప్రభావం అభ్యర్థుల గెలుపోటములపై తీవ్రప్రభావం చూపుతున్నాయి.
- నియోజకవర్గంలో ప్రస్తుతం 2,14,974మంది ఓటర్లు ఉన్నారు.
- వీరిలో సుమారు లక్ష వరకు కార్మికులు, వారి కుటుంబాలుంటాయి.
- 2009లో ఇండిపెండెంట్‌గా, 2014లో బీఆర్ఎస్ నుంచి సోమారపు సత్యనారాయణ ఎమ్మెల్యేగా రెండుసార్లు విజయం సాధించారు.

జంగ్ తెలంగాణ

గోదావరిఖని: పునర్విభజనకు ముందు మేడారం(ఎస్సీ) నుంచి పునర్విభజన తర్వాత రామగుండం(జనరల్) అసెంబ్లీ నుంచి బరిలో దిగిన స్వతంత్ర అభ్యర్థులకూ నియోజకవర్గ ఓటర్లు పట్టం కడుతూ వస్తున్నారు. మేడారం నుంచి ఎం.రామ్‌గోపాల్‌రెడ్డి, మాలెం మల్లేశం స్వతంత్రులుగా బరిలో దిగి విజయం సాధించారు. పునర్విభజన తర్వాత రామగుండం నుంచి ప్రధాన పార్టీలతో పోటీపడిన సోమారపు సత్యనారాయణను కూడా ఓటర్లు తమ అక్కున చేరుకున్నారు. ఇక గత ఎన్నికల్లో రామగుండం అసెంబ్లీ నుంచి ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి కోరుకంటి చందర్ విజయం సాధించారు. సమీప బీఆర్ఎస్ అభ్యర్థి సోమారపు సత్యనారాయణపై 26,332 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. కాంగ్రెస్ అభ్యర్థి ఎంఎస్ రాజ్‌ఠాకూర్ మూడోస్థానంలో నిలిచారు. మొత్తంగా అభ్యర్థుల తలరాత మార్చేది కార్మికులే కావడం గమనార్హం.



ఈసారి చందర్ వర్సెస్ ఠాకూర్..

- కోరుకంటి చందర్ 2018లో ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ సింహం గుర్తుపై పోటీ చేసి విజయం సాధించారు. టీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ ఓటమి పాలయ్యారు. ఈసారి నవంబర్‌లో జరిగే ఎన్నికల్లో ప్రధానంగా బీఆర్ఎస్ నుంచి కోరుకంటి చందర్, కాంగ్రెస్ నుంచి ఎంఎస్ రాజ్‌ఠాకూర్ మధ్య పోటీ ఉండే అవకాశం ఉంది. బీజేపీ నుంచి కందుల సంధ్యారాణి, ఇండిపెండెంట్‌గా సోమారపు సత్యనారాయణ బరిలో నిలవనున్నారు.

- మేడారం నుంచి రామగుండం దాకా..
- గెలుపోటములను ప్రభావితం చేస్తున్న కార్మికులు
- రామగుండం నియోజకవర్గ ముఖచిత్రం



కొప్పుల ఈశ్వర్



మాతంగి నర్సయ్య



కోరుకంటి చందర్



మాలెం మల్లేశం



సోమారపు సత్యనారాయణ



నాలుగు దశాబ్దాల తర్వాత జనరల్..

- 1957లో జనరల్‌గా ఉన్న మేడారం నియోజకవర్గంలో పీడీఎఫ్ తరఫున జి.లక్ష్మారెడ్డి, 1962లో స్వతంత్ర అభ్యర్థిగా ఎం.రాంగోపాల్‌రెడ్డి విజయం సాధించారు.
- 1967లో ఎస్సీకి కేటాయించారు.
- ఆనాడు గడిపెల్లి రాములు(కాంగ్రెస్) విజయం సాధించగా, 1972, 1978లో జి.ఈశ్వర్(కాంగ్రెస్) ఎన్నికయ్యారు.
- ఎన్టీఆర్ టీడీపీని స్థాపించిన తర్వాత 1983లో జరిగిన ఎన్నికల్లో మాతంగి నర్సయ్య(టీడీపీ) కాంగ్రెస్ కంచుకోటకు బీటలు కొట్టి ఘనవిజయం సాధజించారు.
- ఇదే సమయంలోనే నాదెండ్ల భాస్కర్‌రావు మంత్రివర్గంలో నెలపాటు మంత్రిగా కూడా ఆయన పనిచేశారు.
- అయితే 1985లో ఆయనకు టికెట్ ఇవ్వకుండా సింగరేణి కార్మికుడు మాలెం మల్లేశం(టీడీపీ)కు టికెట్ ఇవ్వగా మల్లేశం ఘన విజయం సాధించారు.
- 1989లో కాంగ్రెస్ నుంచి మాతంగి నర్సయ్య, 1994లో స్వతంత్ర అభ్యర్థిగా మాలెం మల్లేశం, 1999లో టీడీపీ నుంచి మాతంగి నర్సయ్య గెలుపొందారు.
- బీఆర్ఎస్ ఆవిర్భవించాక 2004లో జరిగిన ఎన్నికల్లో కొప్పుల ఈశ్వర్ ఆ పార్టీ తరఫున పోటీచేసి విజయం సాధించారు.
- నియోజకవర్గాల పునర్విభజనలో 42 ఏళ్ల తర్వాత మేడారం(ఎస్సీ)ని తొలగించి రామగుండం నియోజకవర్గం(జనరల్)గా మార్పు చేశారు.
- దీంతో అంతకుముందు మున్సిపల్ చైర్మన్‌గా పనిచేసిన సోమారపు సత్యనారాయణ రెండుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

నాలుగుసార్లు స్వతంత్రులకే పట్టం..

నియోజకవర్గంలో కార్మికులు, వారి కుటుంబాల ఓట్లే అత్యధికంగా ఉన్నాయి. వీరి ఓట్లే అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేస్తున్నాయి. మేడారం నియోజకవర్గంలో 11సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరగ్గా.. నాలుగుసార్లు కాంగ్రెస్, మూడుసార్లు టీడీపీ, ఒకసారి పీడీఎఫ్, ఒకసారి టీఆర్ఎస్, మూడుసార్లు స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందారు. 2009లో రామగుండం అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో కూడా స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన సోమారపు సత్యనారాయణను ఎన్నుకుని ఓటర్లు విలక్షణ తీర్పు ఇచ్చారు. 2018లో జరిగిన ఎన్నికల్లో సింహం గుర్తుపై స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన కోరుకంటి చందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించారు. గెలిచిన తర్వాత చందర్ అప్పటి టీఆర్ఎస్‌లో చేరారు.

మేడారం(ఎస్సీ) అసెంబ్లీ


పదవీకాలం	ఎమ్మెల్యే	పార్టీ
1957–62	జి.లక్ష్మారెడ్డి	పీడీఎఫ్
1962–67	ఎం.రాంగోపాల్‌రెడ్డి	స్వతంత్ర
1967–72	నడిపెల్లి రాములు	కాంగ్రెస్
1972–78	జి.ఈశ్వర్	కాంగ్రెస్
1978–83	జి.ఈశ్వర్	కాంగ్రెస్
1983–85	మాతంగి నర్సయ్య	టీడీపీ
1985–89	మాలెం మల్లేశం	టీడీపీ
1989–94	మాతంగి నర్సయ్య	కాంగ్రెస్
1994–99	మాలెం మల్లేశం	స్వతంత్ర
1999–2004	మాతంగి నర్సయ్య	టీడీపీ
2004–09	కొప్పుల ఈశ్వర్	టీఆర్ఎస్

రామగుండం సమాచారం

జనాభా	2,93,085
ఓటర్లు	2,14,974
పురుషులు	1,08,233
మహిళలు	1,06,716
థర్డ్‌జెండర్	25

రామగుండం అసెంబ్లీ(జనరల్)

పదవీకాలం	ఎమ్మెల్యే	పార్టీ
2009–2014	సోమారపు సత్యనారాయణ	స్వతంత్ర
2014–2018	సోమారపు సత్యనారాయణ	టీఆర్ఎస్
2018–2023	కోరుకంటి చందర్	ఆలిండియా ఫార్వర్డ్‌బ్లాక్



ప్రతీ సెగ్మెంట్‌లో ఫిర్యాదుల పర్యవేక్షణ కేంద్రం

- ఫిర్యాదులను రిజిస్టర్‌లో నమోదు చేయాలి
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: ఎన్నికల నిర్వహణ సందర్భంగా అందే ఫిర్యాదులను పర్యవేక్షించేందుకు జిల్లా కేంద్రంలో సెగ్మెంట్‌కో ఫిర్యాదుల సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. జిల్లా ఫిర్యాదుల కేంద్రాన్ని సోమవారం రామగుండం పోలీసు కమిషనర్ రెమా రాజేశ్వరి, డీసీపీ చేతన, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు అరుణశ్రీ, మధుమోహన్, హనుమా నాయక్‌తో కలిసి కలెక్టర్ పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడారు. యాప్, టోల్‌ఫ్రీ నంబర్ల ద్వారా అందే ఫిర్యాదులపై సత్వరమే స్పందించేందుకు వీలు ఉంటుందని తెలిపారు. ఎన్నికల అధికారులు రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, తిరుపతిరావు, మెహరాజ్ మహమ్మద్, ఏవో శ్రీనివాస్, నరహరి, డెప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఈడీఎం కవిత తదితరులు ఉన్నారు.




ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, సీపీ తదితరులు

పోలింగ్ శాతం పెంచాలి

ప్రతీఓటరు తమ హక్కును సద్వినియోగం చేసుకుని పోలింగ్ శాతం పెంచేందుకు సహకరించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ కోరారు. కలెక్టరేట్‌లో సీపీ రెమా రాజేశ్వరితో కలిసి ఓటరు చైతన్యరథం ప్రారంభించారు. వచ్చే ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేలా ఓటర్లలో చైతన్యం తెచ్చేందుకు కళాకారులతో ఆట, పాటలతో వివిధ కార్యక్రమాలు రూపొందించామన్నారు. గత ఎన్నికల్లో తక్కువ పోలింగ్ శాతం నమోదైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. డీసీపీ చేతన, రిటర్నింగ్ అధికారులు హనుమా నాయక్, మధుమోహన్, స్వీప్ నోడల్ అధికారి రవుఫ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ వయసు పెంచిన ఘనత కేసీఆర్‌దే..

గోదావరిఖని: సింగరేణి కార్మికుని బిడ్డగా, కార్మికుల కష్టసుఖాలు తెలిసిన వాడిగా, ఉద్యమ నాయకుడినైన తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కోరారు. సోమవారం ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3 కృషి భవన్‌లో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. కోలిండియాలో ఎక్కడా లేనివిధంగా ఉద్యోగ విరమణ వయస్సును 61 సంవత్సరాలకు పెంచిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. సింగరేణి కార్మికులు దేశ సరిహద్దుల్లో కాపలా కాసే సైనికులతో సమానమని, ఐటీ రద్దు కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తే.. బీజేపీ ప్రభుత్వం ఆమోదముద్ర వేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో జరిగిన అవినీతి, కుంభకోణాలను సాకుగా చూపి బొగ్గు గనులను వేలం పాట ద్వారా ప్రైవేటుపరం చేసే ఎంఎండీఆర్–2014 యాక్ట్‌ను ప్రవేశపెట్టిందని దుయ్యబట్టారు. టీబీజీకేఎస్ అధ్యక్షుడు బి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

టికెట్ ఎవరికో?

- పెద్దపల్లి, మంథని బీజేపీ అభ్యర్థిత్వాలపై ఉత్కంఠ
- 'చల్లా' రాకతో మంథనిలో మారిన పొలిటికల్ సీన్
- పెద్దపల్లిలో ఎవరి ప్రయత్నాల్లో వారే..

సాక్షి, పెద్దపల్లి: జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు ఖరారయ్యారు. బీజేపీ అధిష్టానం తొలివిడతలో రామగుండం బీజేపీ అభ్యర్థిగా కందుల సంధ్యారాణిని ప్రకటించింది. దీంతో అభ్యర్థులు క్షేత్రస్థాయిలో ప్రచారం స్పీడ్ పెంచారు. అయితే, పెద్దపల్లి, మంథనిలో బీజేపీ అభ్యర్థుల పేర్లు ఫైనల్ కాలేదు. ఇక్కడి నుంచి ఎవరు బరిలో నిలుస్తారోనని ఉత్కంఠ కొనసాగుతోంది. మిగతా పార్టీల్లో కూడా ఆసక్తి కలిగిస్తోంది. స్థానిక పరిస్థితుల ఆధారంగా గెలుపు గుర్రాలకే టిక్కెట్ కేటాయించేందుకు బీజేపీ ఇప్పటికే ఫ్లాష్ సర్వే నిర్వహించింది. దీని ఆధారంగా రేపు లేదా ఎల్లుండి అభ్యర్థులను ప్రకటించే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు.. ప్రత్యర్థి పార్టీలు అభ్యర్థులను ఖరారు చేసి ప్రచారంలో దూసుకుపోతున్నాయి. ఈ తరుణంలో తమ పార్టీ ఇంకా అభ్యర్థుల ఎంపికపై కసరత్తు, సమీక్ష, అభిప్రాయ సేకరణ అంటూ కాలయాపన చేస్తోందని బీజేపీ శ్రేణుల్లో అసహనం వ్యక్తమవుతున్నది.

చల్లా వర్సెస్ సునీల్‌రెడ్డి

- మంథనిలో బీఆర్ఎస్ నుంచి టికెట్ ఆశించి భంగపడిన చల్లా నారాయణరెడ్డి తాజాగా బీజేపీలో చేరారు.
- టికెట్ హామీ దక్కడంతోనే ఆ పార్టీలో చేరినట్లు చల్లా వర్గీయులు చెబుతున్నారు.
- అయితే, బీజేపీని క్షేత్ర స్థాయిలోకి తీసుకెళ్తున్న సునీల్‌రెడ్డి టికెట్‌పై సందిగ్ధం నెలకొంది.
- మాజీ ఎమ్మెల్యే చందుపట్ల రాంరెడ్డి వారసుడిగా అప్పటి టీఆర్ఎస్‌లో చేరి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు.
- కారుపై పోటీకి సిద్ధమవుతుండగా అనూహ్యంగా 2014లో పుట్ట మధుకు టికెట్ ఇవ్వటంతో ఇండిపెండెంట్‌గా పోటీచేసి ఓడిపోయారు.
- తదనంతరం బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరి పాదయాత్ర ద్వారా బీజేపీని గ్రామస్థాయికి విస్తరించారు.
- 2018లో బీజేపీ తరఫున పోటీచేసిన రేండ్ల సనత్‌కుమార్ పార్టీకి దూరంగా ఉండటంతో బీజేపీ టికెట్ తనకే వస్తుందని ఆశించారు.
- కానీ, చల్లా రాకతో మరోసారి నిరాశ తప్పేలాలేదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.
- బీజేపీ తరఫున చల్లాకు టికెట్ ఖరారైతే కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో ఎవరికి నష్టం చేకూరుతుందనేది ఇప్పుడు మంథనిలో చర్చనీయాంశంగా మారింది.

పెద్దపల్లిలో పోటాపోటీ

పెద్దపల్లి అసెంబ్లీకి బీజేపీ నుంచి పోటీచేసేందుకు అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ప్రధానంగా మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టిముక్కల సురేశ్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు మీస అర్జున్‌రావు, ఎర్ర శేఖర్‌యాదవ్, ఏగోళపు సదయ్యగౌడ్ సహా 13మంది టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరితోపాటు జెడ్పీటీసీ గంట రాములు, కౌన్సిలర్ కొలిపాక శ్రీనివాస్, నల్లా మనోహర్‌రెడ్డి టికెట్ ఆశిస్తున్నారు. బీఆర్ఎస్ నుంచి రెడ్డి, కాంగ్రెస్ నుంచి వెలమ అభ్యర్థులు పోటీపడుతుండటంతో బీజేపీ నుంచి బీసీ అభ్యర్థిని బరిలో నిలిపితే ఎలా ఉంటుంది? సామాజిక వర్గాల వారీగా, పోటీ పడే అభ్యర్థుల బలాబలాలు ఎలా ఉంటాయనే తదితర అంశాలతో అధిష్టానం ఇప్పటికే ఫ్లాష్ సర్వే నిర్వహించింది. ఆ నివేదిక ఆధారంగా అభ్యర్థిని ఎంపికచేయనున్నారు. దీంతో కొందరు ఆశావహులు బీజేపీ నాయకులతో టచ్‌లో ఉంటూ వారి ప్రాపకంతో టికెట్ సాధించాలని నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

'సీజ్ చేసిన సొత్తుకు ఆధారాలు చూపండి'

పెద్దపల్లిరూరల్: పెద్దమొత్తంలో నగదు, ఇతర సామగ్రి తీసుకెళ్తున్నప్పుడు తప్పనిసరిగా ఆధారాలను వెంట ఉంచుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ కోరారు. ఆధారాలు లేనినగదుతోపాటు ఇతర ఏ సామగ్రినైనా సీజ్ చేస్తామన్నారు. ఈమేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఇప్పటివరకు రూ.97,86,860 నగదు జప్తు చేశారని, ఆధారాలు చూపిన రూ.94,52,850 నగదు విడుదల చేశారని తెలిపారు. పెద్దపల్లి సెగ్మెంట్‌లో రూ.20,58,000 నగదు జప్తుకాగా రూ.18,85,000 విడుదల చేశామన్నారు. రామగుండంలో రూ.34.45లక్షలు జప్తుచేసి ఆధారాలు చూపినందున మొత్తం విడుదల చేసినట్లు వివరించారు. మంథనిలో రూ.42,83,860 నగదు జప్తు కాగా అందులో రూ.41,22,850 విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు సీనియర్ ఇన్‌స్పెక్టర్ సురేందర్‌రెడ్డిని 91828 62887 నంబరులో సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

క్లుప్తంగా

కరాటే పోటీల్లో ప్రతిభ



విద్యార్థులతో ప్రిన్సిపాల్ జ్ఞానచంద్

జ్యోతినగర్(రామగుండం): ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కరాటే పోటీల్లో ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని సచ్‌దేవ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. సోమవారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో జిల్లాస్థాయి కరాటే పోటీలకు ఎంపికైన అండర్–14లో ముక్తిశ్రీ, అండర్–17లో బి.దేవేంద్రను ప్రిన్సిపాల్ జ్ఞానచంద్, హెచ్‌ఎం ఆరస్ జ్యోతి, ఉపాధ్యాయులు అభినందించారు.

డీసీసీ అధికార ప్రతినిధిగా బాపు



నియామకపత్రం అందుకుంటున్న బాపు

జ్యోతినగర్(రామగుండం): కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధిగా వెంగళ బాపును నియమించారు. ఈమేరకు డీసీసీ అధ్యక్షుడు రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ సోమవారం నియామకపు ఉత్తర్వులను బాపుకు అందించారు. కార్పొరేషన్ ఐదో డివిజన్ నర్రాశాలపల్లెకు చెందిన బాపు.. పార్టీకి చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ బాధ్యతలు అప్పగించారు.

కేసు నమోదు

జ్యోతినగర్(రామగుండం): ప్రజాశాంతికి భంగం కలిగించే క్రమంలో బీఆర్‌ఎస్ సమావేశంలో కోడిగుడ్లు విసిరిన వ్యక్తిపై ఎన్టీపీసీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్టీపీసీ ఎస్సై జీవన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి కోరుకంటి చందర్ ప్రజాఅంకిత యాత్రలో టీటీఎస్‌కు చెందిన రామకృష్ణ కోడిగుడ్లు విసరడంతో అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఎన్టీపీసీ బీఆర్‌ఎస్ పట్టణ కమిటీ ప్రధాన కార్యదర్శి బుర్ర శంకర్ గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

తండ్రిని చంపిన కేసులో జీవితఖైదు

సుల్తానాబాద్‌రూరల్: ఆస్తి కోసం తండ్రిని చంపిన కొడుకు సదానందానికి జీవిత ఖైదు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ పెద్దపల్లి ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు జడ్జి హేమంత్‌కుమార్ సోమవారం తీర్పు చెప్పారు. సీఐ జగదీశ్ కథనం ప్రకారం.. సుల్తానాబాద్‌లోని యాదవనగర్‌కు చెందిన బండ గట్టయ్య–కనకవ్వ దంపతుల పెద్దకుమారుడు బండ సదానందానికి వివాహమైంది. పదేళ్లక్రితం భార్య విడాకులు తీసుకుంది. అప్పటి నుంచి సదానదరం తల్లిదండ్రులపైనే ఆధాపడి ఉన్నాడు. జులాయిగా తిరుగుతూ మద్యానికి బానిసయ్యాడు. డబ్బుల కోసం తరచూ తల్లిదండ్రులను వేధిస్తూన్నాడు. ఈక్రమంలో గతేడాది జూలై ఒకటో తేదీన డబ్బులు అడగడంతో లేవని తల్లిదండ్రులు సమాధానం చెప్పారు. వారితో గొడవకు దిగిన సదానందం.. పారతో తండ్రి గట్టయ్య తలపై బలంగా మోదాడు. తీవ్రంగా గాయపడ్డ బాధితుడిని వరంగల్ ఎంజీఎంకు తరలించగా అదే నెల పదో తేదీన మరణించాడు. చిన్నకొడుకు కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ఆధారాలతో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సదానందం తన తండ్రిని హత్య చేసినట్లు కోర్టు తీర్పు చెప్పింది. సాక్షులను ప్రవేశపెట్టడానికి సహకరించిన సీజ జగదీశ్, ఎస్సై విజేందర్‌ను రామగుండం సీపీ రెమా రాజేశ్వరి అభినందించారు.

బాధ్యతగా పనిచేయకుంటే చర్యలు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



ఇన్‌చార్జిని హెచ్చరిస్తున్న కలెక్టర్..



కలెక్టరేట్‌లో బాధితులు..

- ధరణి సహాయక కేంద్రం ఇన్‌చార్జిపై కలెక్టర్ ఆగ్రహం

పెద్దపల్లిరూరల్: 'ప్రభుత్వశాఖలో పనిచేసేవారు తమ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాలి.. లేదంటే సస్పెండ్ చేస్తా' అని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ హెచ్చరించారు. 'తమ భూమి రికార్డుల్లో కనిపించడం లేదనే ఆవేదన, ఆందోళనతో రైతులు వస్తారు.. వారికి అవసరమైన సూచనలు ఇవ్వకపోతే.. మీరెందుకు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల కోసం వచ్చేవారితో మర్యాదగా మాట్లాడాలని, సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కారం చూపాలని, ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పక్కనేఉన్న పంటరుణమాఫీ కేంద్రం వద్ద ఉన్న రైతుల సమస్యలు పరిష్కరించాలని ఇన్‌చార్జికి సూచించారు. కమాన్‌పూర్ మండలం కన్నాల నుంచి వచ్చిన ఇస్లావత్ పున్నంచందు, లక్ష్మి దంపతులు తమకున్న రెండున్నర ఎకరాలు సాగు చేసుకుంటున్నామని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అయితే తమకు పాసుపుస్తకం ఇదే సర్వే నంబరులో ఉందని, ఆ భూమిని అమ్ముకున్నోళ్లకే ప్రభుత్వం పట్టాపాసుపుస్తకం ఇవ్వడంతో తమకు అన్యాయం జరుగుతోందని వాపోయారు. ఈవిషయాన్ని ధరణి సహాయక కేంద్రంలో సిబ్బందిని అడిగితే సరైన సమాధానం ఇవ్వడంలేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వారి సమస్య విన్న కలెక్టర్.. పరిష్కారానికి అవసరమైన సూచనలు ఇచ్చి వారిని సముదాయించి అక్కడి నుంచి పంపించారు.

అయ్యో.. ప్రజావాణి లేదా?

పెద్దపల్లిరూరల్: 'అయ్యో.. ఈరోజు ప్రజావాణి కార్యక్రమం లేదా' అని జిల్లాలోని పలు మండలాలు, గ్రామాల నుంచి కలెక్టరేట్‌కు వచ్చిన అభ్యాగ్యులు ఆందోళనకు గురయ్యారు. తమ సమస్యలపై కలెక్టర్, ఇతర అధికారులకు విన్నవించేందుకు వచ్చామని వాపోయారు. ప్రజావాణి లేకపోవడంతో చాలామంది నిరాశతో వెనుదిరిగారు. ఎన్నికలకు సంబంధించిన సమావేశాల్లో పాల్గొని కలెక్టరేట్‌కు వచ్చిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు కొందరు తమ సమస్యలను విన్నవించగా.. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

ఎన్నికలు పూర్తయ్యేదాకా ప్రజావాణి లేదు..

అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేదాకా ప్రజావాణి వాయిదా వేశామని కలెక్టర్ తెలిపారు. ప్రతీసోమవారం నిర్వహించే ప్రజావాణి రద్దవడంతో ప్రజలు తమ సమస్యలపై వినతులను ఇచ్చేందుకు వచ్చి ఇబ్బందులు పడొద్దని సూచించారు.

సారూ.. ట్రైసైకిల్ ఇప్పించండి



నా కాళ్లు పనిచేయడంలేదు. నడవలేని పరిస్థితి. పేదకుటుంబం. పనుల కోసం ఎటుపోవాలన్నా ఇబ్బందిగా ఉంది. బ్యాటరీ ట్రైసైకిల్ ఇప్పించి ఆదుకోండి.

– మీర్జాఅమీర్‌బేగ్, కొలనూర్

ఆర్థికసాయం చేయండి



మేకలు కాస్తూ జీవిస్తున్నా. మేతకు వెళ్లినపుడు విషపూరితమైన ఆహారం తిని ఐదు మేకలు చనిపోయినయి. ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పించి ఆదుకోవాలి.

– బొల్లి లింగయ్య, మల్యాల

ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

పెద్దపల్లిరూరల్: అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండాలని కేంద్ర సీనియర్ డిప్యూటీ ఎన్నికల అధికారి నితేశ్‌వ్యాస్ సూచించారు. జిల్లా ఎన్నికల అధికారులతో సోమవారం వీడియోకాన్ఫరెన్సు ద్వారా ఆయన మాట్లాడారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ రెమారాజేశ్వరి, డీసీపీ చేతన, రిటర్నింగ్ అధికారులు హాజరయ్యారు. నామినేషన్ల స్వీకరణలో సమయపాలన పాటించాలన్నారు. అభ్యర్థులకు ఓటరు జాబితా వివరాలు అందించాలన్నారు. ప్రతీ సెగ్మెంట్‌లో మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. తనిఖీల సమయంలో కమిషన్ నియమనిబంధనలను పాటించాలన్నారు. రూ.10లక్షలు మించి జప్తుచేస్తే ఆ సమాచారాన్ని ఆదాయపు పన్ను శాఖ అధికారులకు ఇవ్వాలని సూచించారు. రిటర్నింగ్ అధికారులు అరుణశ్రీ, మధుమోహన్, హనుమా నాయక్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో ప్రముఖుల చేరిక



ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చందర్

రామగుండం: అంతర్గాం మండలం బ్రాహ్మణపల్లికి చెందిన కాంగ్రెస్ క్రియాశీలకులు సోమవారం బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఇందులో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఆర్‌ఎంపీ ఫోరం మండల అధ్యక్షుడు అల్లనేరడి కనకయ్య, మహిళా అధ్యక్షురాలు ఉదురుకోట ప్రియాంక ఉన్నారు. వీరికి ఎమ్మెల్యే కోరుకంటి చందర్ బీఆర్‌ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతినాయక్, నాయకులు గీట్ల శంకర్‌రెడ్డి, మడ్డి వెంకటేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ అభ్యర్థిగా నరేశ్



అంబటి నరేశ్

గోదావరిఖని: బహుజన్ సమాజ్‌వాదీ పార్టీ(బీఎస్పీ) రామగుండం నియోజకవర్గ అభ్యర్థిగా గోదావరిఖనికి చెందిన కార్మిక నేత అంబటి నరేశ్‌యాదవ్‌ను ప్రకటించారు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ రెండో జాబితా వెల్లడించారు. సింగరేణి ఉద్యోగానికి రాజీనామా చేసి ఆర్‌ఎఫ్‌సీఎల్ యూనియన్ అధ్యక్షుడిగా, సింగరేణి కార్మిక నాయకుడిగా నరేశ్ సేవలు అందిస్తున్నారు.

పేరు	: అంబటి నరేశ్
స్వగ్రామం	: గోదావరిఖని– జనగామ
వృత్తి	: సింగరేణిఉద్యోగం (రాజీనామా)
చదువు	: పోస్టుగాడ్యుట్
వయస్సు	: 35ఏళ్లు
కుటుంబం	: భార్య, ఇద్దరు పిల్లలు
అనుభవం	: కార్మిక నాయకుడిగా 10ఏళ్లు

కాంగ్రెస్‌లో చేరికలు

గోదావరిఖని: ఉమ్మడి రామగుండం బీఆర్‌ఎస్ మాజీ ఎంపీపీ అడెపు రాజేశం సోమవారం కాంగ్రెస్‌లో చేరగా డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాకూర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే ఎల్కలపల్లి వార్డ్ మెంబర్ బండారి శ్రీనివాస్‌తోపాటు పలువురు పార్టీలో చేరారు. పాలకుర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్, ఎల్కలపల్లి సర్పంచ్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామగుండంలో..

రామగుండం: అంతర్గాం మండలం ఎగ్లాస్‌పూర్‌లో బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. సోమవారం డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ఠాకూర్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇందులో లగిశెట్టి ప్రకాశ్, కట్కూరి శంకర్, తీగుట్ల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గాదె సుధాకర్, నాయకులు బర్పటి లక్ష్మణ్, లగిశెట్టి రాకేశ్ పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ పింఛన్‌పై అవగాహన




మాట్లాడుతున్న కమిషనర్ శ్రీహరిపచౌరి

గోదావరిఖని: సీఎంపీఎఫ్ పింఛన్‌పై ఆర్జీ–2 జీఎం కార్యాలయంలో సోమవారం అవగాహన కల్పించారు. ఉద్యోగి రికార్డ్‌ల్లో నామినీ పేరు లేకుంటే సంస్థ ధ్రువీకరించిన వ్యక్తికి ప్రయోజనాలు అందిస్తారన్నారు. విజిలెన్స్ అవగాహన కార్యక్రమం సందర్భంగా అవినీతిపై ఫిర్యాదు చేయాలని సూచించారు. డీజీఎం(పర్సనల్) జి.రాజేంద్రప్రసాద్, ఫైనాన్స్ డీజీఎం వెంకటరామచంద్ర, మేనేజర్ తిరుపతిరెడ్డి, డీవైపీఎంలు వేణుగోపాల్, వంశీధర్, సివిల్ ఈఈ ప్రతాపగిరిరాజు, సీనియర్ పర్సనల్ అధికారి సురేందర్, ఓంకారి బాబు తదితరులు పాల్గొన్నారు.

ఐఆర్ సమస్య తలెత్తకుండా చూడాలి

గోదావరిఖని: అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా సింగరేణిలో ఇండస్ట్రియల్ రిలేషన్(ఐఆర్) సమస్య తలెత్తకుండా చూడాలని చీఫ్ సెక్యూరిటీ అధికారి శశిధర్ రాజ్ సూచించారు. సోమవారం ఆర్జీ–1 జీఎం కార్యాలయంలో రామగుండం, బెల్లంపల్లి రీజియన్‌లోని సెక్యూరిటీ అధికారులతో జీఎం శ్రీనివాస్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్ చేపట్టాల్సిన ప్రణాళికలు, గనులు, డిపార్ట్‌మెంట్‌లో పాటించవలసిన సెక్యూరిటీ సంబంధిత బాధ్యతల గురించి వివరించారు. ఉత్పత్తి, ఉత్పాదకతకు ఆటకం కలగకుండా చూడాలని, ఆస్తులు కాపాడటంలో సెక్యూరిటీ సిబ్బంది చురుకుగా ఉండాలన్నారు. సీనియర్ సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి, రామగుండం, బెల్లంపల్లి రీజియన్ల సెక్యూరిటీ అధికారులు షరీఫ్, లక్ష్మీనారయణ, రవి, వరప్రసాద్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యాన్ బోల్తా



రోడ్డుపై పడ్డ టమాటలు

సుల్తానాబాద్‌రూరల్: చిన్నకల్వల శివారులోని రాజీవ్ రహదారిపై సోమవారం టమాటా లోడ్‌తో వెళ్తున్న వ్యాన్ అదుపుతప్పి బోల్తాపడింది. కరీంనగర్ నుంచి పెద్దపల్లి వైపు వెళ్తున్న వ్యాన్ ప్రమాదవశాత్తు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. దీంతో టమాటలు రోడ్డు పాలయ్యాయి. డ్రైవర్‌కు ప్రమాదం జరుగలేదు. మరో వ్యాన్‌లో టమాటలు లోడ్‌చేసి గమ్యస్థానాకి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడి మృతి



మధుకర్(ఫైల్)

రామగుండం: మల్యాలపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రాజీవ్‌రహదారిపై ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పోతనకాలనీకి చెందిన సింగరేణి కార్మికుడు లావుడ్య మధుకర్(30) మృతి చెందాడు. సీఐ చంద్రశేఖర్‌గౌడ్, ఎస్సై వెంకట్ కథనం ప్రకారం.. పోతనకాలనీకి చెందిన లావుడ్య నాన్యానాయక్ అన్‌ఫిట్ కావడంతో 2019లో తన కుమారుడు మధుకర్‌కు సింగరేణిలో కేబుల్ ఆపరేటర్‌గా ఉద్యోగం వచ్చింది. ఆదివారం విధులు ముగించుకొని మధ్యాహ్నం ఇంటికి చేరుకున్నాడు. బయటకు వెళ్తున్నాని తన భార్య రమకు చెప్పి రాత్రి ఏడు గంటలకు పల్సర్ బైక్‌పై బయటకు వెళ్లాడు. అర్ధరాత్రి వరకూ తిరిగి రాలేదు. మల్యాలపల్లి రాజీవ్ రహదారి పక్కన కాలువలో ద్విచక్ర వాహనం ఉందని, మృతి చెంది ఉన్నాడని ఎస్సైకి సమాచారం అందింది. ఎస్సై ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. బైక్ నంబరు ఆధారంగా కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. రమ అక్కడకు చేరుకుని తన భర్త మధుకర్‌గా గుర్తించింది. అయితే.. పోతనకాలనీ నుంచి మధుకర్ ఇంతదూరం ఎందుకు వచ్చాడనే విషయం తేలాల్సి ఉందని పోలీసులు తెలిపారు. అయితే, మృతిపై అనుమానాలు ఉన్నాయని, అన్ని కోణాల్లో విచారణ ప్రారంభించామని సీఐ, ఎస్సై వివరించారు. మృతుడికి భార్య రమ, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి సోదరుడు సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

అమ్మ బలగం



అమ్మ ఆశీర్వాదం తీసుకుంటున్న కొమురయ్య

జ్యోతినగర్(రామగుండం): అమ్మను మించిన దైవం లేదనేదానికి నిలువెత్తుగా నిలిచారు అమ్మ బలగం. పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీకి చెందిన మాదరవేన కొమురయ్య న్యాయవాదిగా హైదరాబాద్‌లో ప్రాక్టీస్ చేస్తున్నారు. ఆయన అమ్మ రాజవ్వకు 75 సంవత్సరాల వయసు నిండిన సందర్భంగా సోమవారం కుటుంబసభ్యులందరూ ఇలా ఒకేచోట కలుసుకున్నారు. అమ్మ ఆశీర్వాదం తీసుకున్నారు. తమకు అమ్మకు మించిన దైవం లేదని, భవిష్యత్‌లో ఆమె ఆశీర్వాదంతో మరింత ఎదుగుతామని ఆకాంక్షించారు.

ట్రాక్టర్, బైక్ ఢీకొని ముగ్గురికి గాయాలు



గాయపడ్డ శ్రీనిత్య

సుల్తానాబాద్‌రూరల్: కనుకుల ఎక్స్‌రోడ్డు వద్ద సోమవారం ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఓదెల మండలం కనగర్తికి చెందిన మొగిలి బీరయ్య తన భార్య అర్చన, కూతురు శ్రీనిత్యతో కలిసి బైక్‌పై సుల్తానాబాద్‌లోని సంక్షేమ పాఠశాలకు వస్తున్నారు. తన కూతురును పాఠశాలలో దింపేందుకు వస్తుండగా కదంబపూర్ నుంచి రేగడిమద్దికుంట వైపు వెళ్తున్న ట్రాక్టర్ అదపుతప్పి ఢీకొట్టింది. ఈ ఘటనలో అర్చన, శ్రీనిత్యకు తీవ్రంగా, బీరయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న ఎంపీపీ బాలాజీరావు గాయపడిన వారిని తన వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని మరో ఆస్పత్రికి తరలించారు.

బొగ్గుబాయి వార్తలు

అవినీతి నిర్మూలనతోనే సంస్థ అభివృద్ధి

- ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్



ప్రతిజ్ఞ చేస్తున్న జీఎం శ్రీనివాస్, అధికారులు

గోదావరిఖని: అవినీతి నిర్మూలనతో సంస్థ అభివృద్ధి బాటలో సాగుతుందని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. స్థానిక జీఎం కార్యాలయంలో సోమవారం ఆయన విజిలెన్స్ వారోత్సవాలు ప్రారంభించారు. తొలుత అవినీతికి వ్యతిరేకంగా ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. 1987లో ఏర్పాటు చేసిన విజిలెన్స్ వారోత్సవాలను అక్టోబర్ 30 నుంచి నవంబర్ 5 వరకు నిర్వహిస్తున్నారన్నారు. 'అవినీతిని తిరస్కరించండి.. దేశంపై నిబద్ధత కలిగి ఉండండి' నినాదం ఈఏడాది విజిలెన్స్ వారోత్సవాల ముఖ్య ఉద్దేశమన్నారు. అవినీతిని నిర్మూలించాడానికి కేవలం ప్రభుత్వం రూపొందించే చట్టాలు, నిబంధనలు మాత్రమే సరిపోవని, ప్రతిఒక్కరూ స్వార్థాన్ని విడనాడి, సామాజిక బాధ్యతతో పనిచేస్తే సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం రాంమోహన్, అధికారులు నరేస్ చక్రవర్తి, ఎస్.ధనలక్ష్మి, రాజం, ఆంజనేయులు, బాలసుబ్రహ్మణ్యం, శ్రీనివాస్, వీరారెడ్డి, బంగారు సారంగపాణి, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతిని తిరస్కరించండి

- ఆర్జీ–2 ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్‌రెడ్డి



ప్రతిజ్ఞ చేస్తున్న ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు

గోదావరిఖని: అవినీతిని తిరస్కరించి సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని ఆర్జీ–2 ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. సోమవారం జీఎం కార్యాలయంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహించారు. అవినీతికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. బొగ్గు రవాణా, వెహికల్ ట్రాకింగ్ సిస్టం, వస్తువు కొనుగోలులో రివర్స్ టెండరింగ్, ఆన్‌లైన్ బుకింగ్ తదితర అంశాల్లో ఆధునిక సాంకేతిక విధానం ద్వారా అవకతవకలు జరగకుండా పటిష్టమైన వ్యవస్థ అమలు చేస్తున్నామని తెలిపారు. వివిధ పోస్టుల భర్తీ కోసం నిర్వహించే పరీక్షలో దేశంలో ఎక్కడా లేనివిధంగా పటిష్టమైన వ్యవస్థ సింగరేణిలో ఉందని తెలిపారు. డీజీఎం(పర్సనల్) జి.రాజేంద్రప్రసాద్, ఐఈడీ డీజీఎం మురళీకృష్ణ, ఫైనాన్స్ డీజీఎం వెంకటరామచంద్ర, పర్సనల్ మేనేజర్ ఎస్.అనిల్‌కుమార్, డీవైపీఎంలు వేణుగోపాల్, వంశీధర్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తే ధ్యేయం

- ఆర్జీ–2 ఇన్‌చార్జి జీఎం కె.శ్రీనివాస్‌రెడ్డి



నాటిక ప్రదర్శిస్తున్న యువకార్మికులు

గోదావరిఖని: సంస్థలో చేరిన యువ ఉద్యోగులు రక్షణతో కూడిన ఉత్పత్తి ధ్యేయంగా ముందుకు సాగాలని ఆర్జీ–2 ఇన్‌చార్జి జీఎం కె.శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. రక్షణ పక్షోత్సవాలను పురస్కరించుకుని ఆర్జీ–2 వీటీసీలో సోమవారం రక్షణబృందం తనిఖీ నిర్వహించింది. రక్షణతో పనిచేయడంపై శిక్షణ కేంద్రం నుంచే ప్రారంభించాలన్నారు. నేర్చుకున్న అంశాలను పనిస్థలాల్లో పాటించాలని సూచించారు. ఈసందర్భంగా రక్షణపై ప్రదర్శించిన నాటిక, పాటలు ఆకట్టుకున్నాయి. రక్షణ కమిటీ కన్వీనర్ సుషాంతసహా, సభ్యులు ఎస్డీజేప హుస్సేనీ, పి.మహేశ్వర్, ఆర్జీ–2 ఎస్‌ఓటూ జీఎం అబ్దుల్‌సలీం, ఏరియా రక్షణ అధికారి బి.రవీందర్, వీటీసీ మేనేజర్ రంగారెడ్డి, శిక్షకులు నాగెల్లి సాంబయ్య, మహేశ్, కిశోర్, సతీశ్‌కుమార్,తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీ–3లో పర్యటించిన చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్



చెక్‌పోస్ట్‌లో తనిఖీ చేస్తున్న శశిధర్‌రాజు

రామగిరి: చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ సీహెచ్ శశిధర్‌రాజు సోమవారం ఆర్జీ–3 ఏరియాలో పర్యటించారు. ఓసీపీ–1, 2 ఉపరితల గనులు సందర్శించారు. ఓసీపీ–1లో మెయిన్ చెక్‌పోస్ట్, రికార్డులు పరిశీలించారు. ఓసీపీ–2లో చెక్‌పోస్ట్, డీజిల్ బంక్‌లో రికార్డులు తనిఖీచేశారు. ఎల్–6 కెనాల్ డైవర్షన్ పనుల గురించి జీఎం సుధాకర్‌రావును అడిగి వివరాలు తెలుసుకున్నారు. సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్ఎస్ఓ లక్ష్మీనారాయణ, పుట్టపాక రాజయ్య, జూనియర్ ఇన్‌స్పెక్టర్ తోట రాజేశం తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం

గోదావరిఖని: స్థానిక భాస్కర్‌రావు భవన్‌లో మంగళవారం ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తారు. ఉదయం జెండా ఆవిష్కరణ ఉంటుందని, సాయంత్రం 5 గంటలకు జనరల్ బాడీ సమావేశం నిర్వహిస్తామని యూనియన్ ఉపప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్ సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రక్షణతో కూడిన విధులు ముఖ్యం

రామగిరి: ప్రతీకార్మికుడు రక్షణతో కూడిన విధులు నిర్వర్తించాలని తనిఖీ బృందం కన్వీనర్ ఏజీఎం లలిత్ కుమార్ సూచించారు. సోమవారం భద్రత పక్షోత్సవాలను పురస్కరించుకుని కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య, ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లుతో కలిసి ఏపీఏ గనిని సందర్శించారు. హెల్మెట్ ధరించడంపై ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టు సింగరేణిలోనే అత్యుత్తమ భూగర్భగని అని తెలిపారు. సంస్థను జీరో యాక్సిడెంట్‌గా నిలపాలని కోరారు. సేఫ్టీ అధికారి సీహెచ్ వెంకటరమణ, అధికారులు శ్రీనివాస్‌రావు, రామకృష్ణ, ఎస్.సదానందం, అబ్దుల్ నబీ, కె.అమర్నాథ్‌రెడ్డి, బి.కృష్ణప్రసాద్, శ్రీనివాస్, సురేశ్, పృథ్వీ పాల్గొన్నారు.

వారోత్సవాలపై అవగాహన

రామగిరి: ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు జీఎం కార్యాలయంలో అధికారులు పోస్టర్ ఆవిష్కరించి విజిలెన్స్ వారోత్సవాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పర్చేస్ డీజీఎం పీడీ సుధాకర్, సివిల్ డీజీఎం పద్మరాజు, పర్చేస్ ఎస్ఈ నాగేశ్వర్‌రావు, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, డీవైపీఎం గుర్రం శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తిలో ఓసీపీ–1 ఆదర్శం



షీల్డ్ అందుకుంటున్న ఉద్యోగులు

గోదావరిఖని: ఉత్పత్తి, రక్షణలో సింగరేణిలోనే ఓసీపీ–1 ఆదర్శంగా నిలుస్తోందని ఆర్జీ–3 జీఎం ఎన్.సుధాకర్‌రావు అన్నారు. సోమవారం ఓసీపీ–1 సైట్ ఆఫీస్ నిర్వహించిన సేఫ్టీ దినంలో ఆయన మాట్లాడారు. ఎంతో చరిత్ర కలిగిన ఓసీపీ–1 ఉత్పత్తి, ఉత్పాదకతలో రికార్డులు సృష్టిస్తూ, భద్రతలోనూ అనేక బహుమతులు అందుకుంటోందన్నారు. 53వ వార్షిక భద్రత పక్షోత్సవాల సందర్భంగా ప్రతిభ చూపిన వారికి షీల్డ్ అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సేఫ్టీ బృందం కన్వీనర్ సురేశ్, సభ్యుడు టి.శ్రీనివాస్, ప్రాజెక్టు అధికారి రాధాకృష్ణ, మేనేజర్ ఉదయ్‌హరిజన్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు చేర్చాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు

గోదావరిఖని: కాంట్రాక్టు కార్మికుల సమస్యలను ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. సంస్థ వ్యాప్తంగా 30వేల మంది కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారని అన్నారు. వారి వేతనాల గురించి, పనిభద్రత, ప్రమాదంలో మరణించిన కార్మికులకు కోల్ ఇండియాలో మాదిరిగా ఎక్స్‌గ్రేషియా తదితర అంశాలను రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో పొందుపర్చాలని డిమాండ్ చేశారు. నాయకులు దూలం శ్రీనివాస్, బి.మధు, మద్దెల శ్రీనివాస్, కిరణ్‌రెడ్డి, ఉపేందర్, ఉల్లి మొగిలి, లక్ష్మీనారాయణ, భూమయ్య, రషీద్ ఖాన్, అరవింద్, తిరుపతమ్మ, గట్టు మహేందర్ పాల్గొన్నారు.




సబలెంకా శుభారంభం

మహిళల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నీ డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో గత ఏడాది రన్నరప్, ప్రపంచ నంబర్‌వన్ సబలెంకా (బెలారస్) శుభారంభం చేసింది. మెక్సికోలో జరుగుతున్న ఈ టోర్నీలో తొలి లీగ్ మ్యాచ్‌లో సబలెంకా 6–0, 6–1తో మరియా సాకరి (గ్రీస్)పై గెలిచింది. 74 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సబలెంకా ఆరు ఏస్‌లు సంధించి, తన ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. మరో లీగ్ మ్యాచ్‌లో జెస్సికా పెగులా (అమెరికా) 7–5, 6–2తో రిబాకినా (కజకిస్తాన్)పై విజయం సాధించింది.

అర్జున్‌కు మూడో గెలుపు

గ్రాండ్ స్విస్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ మూడో విజయం నమోదు చేశాడు. యూకేలోని ఐల్ ఆఫ్ మ్యాన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో ఐదో రౌండ్ గేమ్‌లో తెల్లపావులతో ఆడిన అర్జున్ 68 ఎత్తుల్లో రినాత్ జుమాబయేవ్ (కజకిస్తాన్)పై గెలుపొందాడు. ఐదో రౌండ్ తర్వాత అర్జున్ నాలుగు పాయింట్లతో మరో ఇద్దరితో కలిసి ఉమ్మడిగా టాప్ ర్యాంక్‌లో ఉన్నాడు.





ఫారూఖీ

అఫ్గాన్ తీన్‌మార్...

- శ్రీలంకపై ఏడు వికెట్లతో సంచలన విజయం
- ఒకే టోర్నీలో మూడు ప్రపంచ చాంపియన్ జట్లను ఓడించిన హష్మతుల్లా బృందం
- బంతితో మెరిసిన ఫారూఖీ
- రహ్మత్ షా, హష్మతుల్లా, అజ్మతుల్లా అర్ధ సెంచరీలు

ఇకపై తమ జట్టును కూనగా పరిగణించాల్సిన అవసరం లేదని అఫ్గానిస్తాన్ చాటి చెప్పింది. మేటి జట్లపై తాము సాధిస్తున్న విజయాలు గాలివాటమేమీ కాదని తమ నిలకడైన ప్రదర్శనతో నిరూపించింది. మూడోసారి వన్డే ప్రపంచకప్‌లో ఆడుతున్న అఫ్గానిస్తాన్ ఈసారి తమకంటే అన్ని విభాగాల్లో ఎంతో మెరుగైన జట్లను బోల్తా కొట్టిస్తూ ఔరా అనిపించింది. డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌ను కంగుతినిపించిన ఉత్సాహంతో 1992 విశ్వవిజేత పాకిస్తాన్ జట్టును కూడా మట్టికరిపించిన అఫ్గానిస్తాన్ జట్టు తాజాగా 1996 ప్రపంచ చాంపియన్ శ్రీలంకను ఓడించి అందర్నీ ఆశ్చర్యపరిచింది.

పుణే: ప్రత్యర్థి జట్టు గత రికార్డు ఎలా ఉంటేనేమి తమదైన రోజున సమష్టిగా గర్జిస్తే అద్భుత ఫలితం సాధించవచ్చని వన్డే ప్రపంచకప్ టోర్నీలో అఫ్గానిస్తాన్ జట్టు మూడోసారి నిరూపించింది. భారీ అంచనాలు పెట్టుకోకుండా ఈ మెగా ఈవెంట్‌లో బరిలోకి దిగిన అఫ్గానిస్తాన్ మూడో సంచలన విజయంతో అలరించింది. 1996 ప్రపంచ చాంపియన్ శ్రీలంక జట్టుతో సోమవారం జరిగిన మ్యాచ్‌లో హష్మతుల్లా షాహిది నాయకత్వంలోని అఫ్గానిస్తాన్ జట్టు ఏడు వికెట్ల తేడాతో గెలిచి అబ్బురపరిచింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 49.3 ఓవర్లలో 241 పరుగులకు ఆలౌటైంది. నిసాంక (60 బంతుల్లో 49; 5 ఫోర్లు), కెప్టెన్ కుశాల్ మెండిస్ (50 బంతుల్లో 39; 3 ఫోర్లు), సమరవిక్రమ (40 బంతుల్లో 36; 3 ఫోర్లు), తీక్షణ (31 బంతుల్లో 29; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఫజల్‌హక్ ఫారూఖీ (4/34) శ్రీలంక జట్టును దెబ్బ తీశాడు. ఒకదశలో 134/2తో పటిష్టస్థితిలో కనిపించిన శ్రీలంక నిసాంక అవుటయ్యాక తడబడింది. 107 పరుగుల తేడాలో ఏడు వికెట్లు కోల్పోయింది. కెరీర్‌లో 100వ వన్డే ఆడిన రషీద్ ఖాన్ ఒక వికెట్ తీయగా, మరో స్పిన్నర్ ముజీబ్‌కు రెండు వికెట్లు దక్కాయి. అనంతరం 242 పరుగుల విజయ లక్ష్యాన్ని అఫ్గానిస్తాన్ 45.2 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ గుర్బాజ్ (0) డకౌట్‌కాగా... రహ్మత్ షా (74 బంతుల్లో 62; 7 ఫోర్లు), హష్మతుల్లా షాహిది (74 బంతుల్లో 58 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్), అజ్మతుల్లా ఒమర్‌జాయ్ (63 బంతుల్లో 73 నాటౌట్; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో అఫ్గానిస్తాన్ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. హష్మతుల్లా, అజ్మతుల్లా నాలుగో వికెట్‌కు అజేయంగా 111 పరుగులు జోడించడం విశేషం.

ఈ టోర్నీ తొలి మ్యాచ్‌లో భారత్ చేతిలో ఓడిపోయిన అఫ్గానిస్తాన్... రెండో మ్యాచ్‌లో 69 పరుగుల తేడాతో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌ను ఓడించి బోణీ కొట్టింది. మూడో మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో 149 పరుగుల తేడాతో ఓడిపోయి... నాలుగో మ్యాచ్‌లో విజృంభించి 1992 విశ్వవిజేత పాకిస్తాన్‌పై ఏకంగా 8 వికెట్ల తేడాతో గెలిచింది. అనంతరం అదే ఉత్సాహంతో శ్రీలంకను కూడా మట్టికరిపించి అఫ్గానిస్తాన్ పాయింట్ల పట్టికలో ఐదో స్థానానికి ఎగబాకింది. మూడోసారి వన్డే వరల్డ్‌కప్‌లో ఆడుతున్న అఫ్గానిస్తాన్ ఒకే ప్రపంచకప్‌లో మూడు విజయాలు సాధించడం ఇదే ప్రథమం. 2015 ప్రపంచకప్‌లో ఒక మ్యాచ్‌లో నెగ్గిన అఫ్గానిస్తాన్... 2019 ప్రపంచకప్‌లో ఆడిన తొమ్మిది మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయింది. ఈ ప్రపంచకప్‌లో మాత్రం అఫ్గానిస్తాన్ తమ కంటే మెరుగైన జట్లకు చెమటలు పట్టిస్తోంది. ఈ టోర్నీలో అఫ్గానిస్తాన్ మిగిలిన మూడు మ్యాచ్‌లను నెదర్లాండ్స్ (నవంబర్ 3న), ఆస్ట్రేలియా (నవంబర్ 7న), దక్షిణాఫ్రికా (నవంబర్ 10న) జట్లతో ఆడుతుంది.



అజ్మతుల్లా



రహ్మత్ షా



హష్మతుల్లా

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) గుర్బాజ్ (బి) అజ్మతుల్లా 46; దిముత్ కరుణరత్నే (ఎల్బీడబ్ల్యూ) (బి) ఫారూఖీ 15; కుశాల్ మెండిస్ (సి) నజీబుల్లా (సబ్) (బి) ముజీబ్ 39; సమరవిక్రమ (ఎల్బీడబ్ల్యూ) (బి) ముజీబ్ 36; అసలంక (సి) రషీద్ ఖాన్ (బి) ఫారూఖీ 22; ధనంజయ డిసిల్వా (బి) రషీద్ ఖాన్ 14; ఏంజెలో మాథ్యూస్ (సి) నబీ (బి) ఫారూఖీ 23; చమీర (రనౌట్) 1; తీక్షణ (బి) ఫారూఖీ 29; కసున్ రజిత (రనౌట్) 5; మదుషంక (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (49.3 ఓవర్లలో ఆలౌట్) 241. వికెట్ల పతనం:** 1–22, 2–84, 3–134, 4–139, 5–167, 6–180, 7–185, 8–230, 9–239, 10–241. **బౌలింగ్:** ముజీబ్ ఉర్ రెహ్మాన్ 10–0–38–2, ఫజల్లఖ్ ఫారూఖీ 10–1–34–4, నవీన్ ఉల్ హక్ 6.3–0–47–0, అజ్మతుల్లా ఒమర్‌జాయ్ 7–0–37–1, రషీద్ ఖాన్ 10–0–50–1, నబీ 6–0–33–0.

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్: రహ్మానుల్లా గుర్బాజ్ (బి) మదుషంక 0; ఇబ్రహీమ్ జద్రాన్ (సి) కరుణరత్నే (బి) మదుషంక 39; రహ్మత్ షా (సి) కరుణరత్నే (బి) రజిత 62; హష్మతుల్లా షాహిది (నాటౌట్) 58; అజ్మతుల్లా (నాటౌట్) 73; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (45.2 ఓవర్లలో మూడు వికెట్లకు) 242. వికెట్ల పతనం:** 1–0, 2–73, 3–131. **బౌలింగ్:** మదుషంక 9–0–48–2, రజిత 10–0–48–1, మాథ్యూస్ 3–0–18–0, చమీర 9.2–0–51–0, తీక్షణ 10–0–55–0, ధనంజయ డిసిల్వా 4–0–21–0.

ప్రపంచకప్‌లో నేడు

పాకిస్తాన్ × బంగ్లాదేశ్
వేదిక: కోల్‌కతా
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	6	6	0	12	1.405
దక్షిణాఫ్రికా	6	5	1	10	2.032
న్యూజిలాండ్	6	4	2	8	1.232
ఆస్ట్రేలియా	6	4	2	8	0.970
అఫ్గానిస్తాన్	6	3	3	6	-0.718
శ్రీలంక	6	2	4	4	-0.275
పాకిస్తాన్	6	2	4	4	-0.387
నెదర్లాండ్స్	6	2	4	4	-1.277
బంగ్లాదేశ్	6	1	5	2	-1.338
ఇంగ్లండ్	6	1	5	2	-1.652

నోట్: ఆ–ఆడినవి, గె–గెలిచినవి, ఓ–ఓడినవి, పా–పాయింట్లు, నె.ర.రే–నెట్ రన్‌రేట్

అనీశ్ డబుల్ ధమాకా

కాంస్య పతకంతోపాటు పారిస్ ఒలింపిక్ బెర్త్ సొంతం



చాంగ్వాన్ (దక్షిణ కొరియా): ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్ల పతకాల వేట కొనసాగుతోంది. సోమవారం జరిగిన పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో భారత యువ షూటర్ అనీశ్ భన్వాలా కాంస్య పతకం సాధించాడు. ఆరుగురి మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో 21 ఏళ్ల అనీశ్ 28 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంతో ముగించాడు. ఈ ప్రదర్శనతో అనీశ్ వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌ను కూడా ఖరారు చేసుకున్నాడు. ఇప్పటి వరకు షూటింగ్‌లో భారత్‌కు 12 ఒలింపిక్ బెర్త్‌లు లభించాయి. మరోవైపు పురుషుల ట్రాప్ టీమ్ ఈవెంట్‌లో హైదరాబాద్ షూటర్ కైనన్ షెనాయ్, జొరావర్ సింగ్ సంధూ, పృథ్వీరాజ్ తొండైమన్‌లతో కూడిన భారత జట్టుకు రజత పతకం దక్కింది. కైనన్, జొరావర్, పృథ్వీరాజ్ బృందం 341 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచింది. ఇప్పటి వరకు ఈ టోర్నీలో భారత్ 30 పతకాలు సాధించింది.

వెర్‌స్టాపెన్ రికార్డు

ఈ సీజన్‌లో 16వ విజయం



మెక్సికో సిటీ: ఇప్పటికే ప్రపంచ డ్రైవర్స్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను సొంతం చేసుకున్నప్పటికీ... రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ మాత్రం ఫార్ములావన్–2023 సీజన్‌లో ఎదురులేకుండా దూసుకుపోతున్నాడు. మెక్సికో గ్రాండ్‌ప్రి రేసులో వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. 71 ల్యాప్‌ల ప్రధాన రేసును మూడో స్థానం నుంచి ప్రారంభించిన వెర్‌స్టాపెన్ తొలి మలుపు వద్ద ప్రత్యర్థి డ్రైవర్లను ఓవర్‌టేక్ చేసి ఆధిక్యంలోకి వచ్చాడు. ఆ తర్వాత రేసు చివరిదాకా ఈ ఆధిక్యాన్ని కాపాడుకొని అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. వెర్‌స్టాపెన్ 71 ల్యాప్‌లను అందరికంటే వేగంగా 2 గంటల 2 నిమిషాల 30.814 సెకన్లలో పూర్తి చేసి విజేతగా నిలిచాడు. ఈ సీజన్‌లో వెర్‌స్టాపెన్‌కిది 16వ గెలుపు కావడం విశేషం. తద్వారా ఒకే ఏడాది అత్యధిక ఎఫ్1 రేసుల్లో గెలిచిన డ్రైవర్‌గా తన పేరిటే ఉన్న రికార్డును వెర్‌స్టాపెన్ బద్దలు కొట్టాడు. గత ఏడాది వెర్‌స్టాపెన్ 15 రేసుల్లో గెలుపొందాడు. ఓవరాల్‌గా వెర్‌స్టాపెన్ కెరీర్‌లో ఇది 51వ విజయం. ఈ క్రమంలో కెరీర్‌లో అత్యధిక ఎఫ్1 విజయాలు సాధించిన డ్రైవర్ల జాబితాలో నాలుగో స్థానంలో ఉన్న అలైన్ ప్రాస్ట్ (ఫ్రాన్స్) సరసన నిలిచాడు.

లెక్క సరిచేసిన భారత్



రాంచీ: ఆసియా మహిళల హాకీ చాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టు వరుసగా మూడో విజయంతో 'హ్యాట్రిక్' సాధించింది. చైనా జట్టుతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 2–1 గోల్స్ తేడాతో నెగ్గింది. భారత్ తరఫున దీపిక (15వ ని.లో), సలీమా టెటె (26వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. చైనా జట్టుకు జాంగ్ జియాకి (41వ ని.లో) ఒక గోల్ అందించింది. ఈ గెలుపుతో ఇటీవల హాంగ్జౌ ఆసియా క్రీడల్లో చైనా జట్టు చేతిలో సెమీఫైనల్లో ఎదురైన ఓటమికి భారత్ బదులు తీర్చుకుంది.

జ్యోతి యర్రాజీకి స్వర్ణం



పనాజీ: జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్‌కు మూడో స్వర్ణ పతకం లభించింది. సోమవారం జరిగిన అథ్లెటిక్స్ ఈవెంట్‌లో మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో జ్యోతి యర్రాజీ చాంపియన్‌గా అవతరించింది. విశాఖపట్నం జిల్లాకు చెందిన జ్యోతి 13.22 సెకన్లలో అందరికంటే వేగంగా ఫైనల్ రేసును ముగించి అగ్రస్థానంలో నిలిచింది. మరోవైపు తెలంగాణ ఖాతాలో 11వ పతకం చేరింది. మహిళల స్విమ్మింగ్ 800 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో వ్రితి అగర్వాల్ రజత పతకం సాధించింది.

సినిమా

కౌంట్ డౌన్ స్టార్ట్



● వెంకటేశ్

వెంకటేశ్ హీరోగా శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం 'సైంధవ్'. నవాజుద్దీన్ సిద్దిఖీ, ఆర్య, శ్రద్ధా శ్రీనాథ్, రుహానీ శర్మ, ఆండ్రియా జెర్మియా, బేబీ సారా, జయప్రకాశ్ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్న 'సైంధవ్' జనవరి 13న సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు వస్తోంది. కాగా ఇది వెంకటేశ్ కెరీర్‌లో 75వ చిత్రం కావడం విశేషం. తాజాగా 'సైంధవ్' విడుదలకు కౌంట్ డౌన్ స్టార్ట్ చేస్తూ మేకర్స్ ఓ కొత్త పోస్టర్‌ని విడుదల చేశారు. ''పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతోన్న చిత్రం 'సైంధవ్'. సినిమా విడుదలకు ఇంకా 75 రోజులు ఉంది. సంతోష్ నారాయణన్ ఈ చిత్రం కోసం అద్భుతమైన ఆల్బమ్ సిద్ధం చేశారు. త్వరలో మ్యూజికల్ ప్రమోషన్స్ స్టార్ట్ చేయబోతున్నాం'' అని మేకర్స్ అన్నారు. ఈ చిత్రానికి సహనిర్మాత: కిశోర్ తాళ్లూరు, కెమెరా: యస్. మణికందన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్. వెంకటరత్నం (వెంకట్).

అమ్మాడీ...



● మృణాల్ ఠాకూర్, నాని

మాట రూపంలో కాకుండా ఇంకాస్త ఎక్కువగా ప్రేమను వ్యక్తపరచాలనుకున్నప్పుడు హీరో హీరోయిన్ పాట పాడుకోవడం చూస్తుంటాం. మృణాల్ ఠాకూర్‌పై నాని అలాంటి ప్రేమనే వ్యక్తపరిచారు. ప్రేమను వ్యక్తపరుస్తూ 'అమ్మాడీ...' అంటూ ఆమెను ఉద్దేశించి పాడారు నాని. 'హాయ్ నాన్న' చిత్రంలోని ఈ పాటను నవంబర్ 4న రిలీజ్ చేయనున్నారు. నాని, మృణాల్ ఠాకూర్ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'హాయ్ నాన్న'. నాని కుమార్తెగా బేబీ కియారా ఖన్నా నటించింది. ఈ చిత్రం కోసం హేషమ్ అబ్దుల్ వహాబ్ స్వరపరచిన పాటల్లో తొలి పాట 'సమయమా..', రెండో పాట 'గాజు బొమ్మ..'ను ఇప్పటికే రిలీజ్ చేశారు. 'అమ్మాడీ...' మూడో పాట. నాని, మృణాల్ మధ్య సాగే రొమాంటిక్ సాంగ్ ఇది అని యూనిట్ పేర్కొంది. శౌర్యువ్ దర్శకత్వంలో మోహన్ చెరుకూరి (సీవీఎం), డా. విజయేందర్ రెడ్డి తీగల ఈ చిత్రాన్ని నిర్మించారు. డిసెంబర్ 7న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో రిలీజ్ కానున్న ఈ చిత్రానికి కెమెరా: సాను జాన్ వర్గీస్ ఐఎస్‌సీ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సతీష్ ఈవీవీ.

మమ్మల్ని సినిమా కలిపింది - విజయ్ దేవరకొండ



● బ్రహ్మానందం, విజయ్ దేవరకొండ, తరుణ్ భాస్కర్, సాయికృష్ణ

''నేను, దర్శకులు నాగ్ అశ్విన్, తరుణ్ భాస్కర్, సందీప్ రెడ్డి వంగా వేర్వేరు చోట్ల పెరిగాం. మా నేపథ్యాలు వేరు.. మమ్మల్ని సినిమా కలిపింది. 'పెళ్ళి చూపులు'తో నన్ను హీరోగా పరిచయం చేశాడు తరుణ్ భాస్కర్. ఆ తర్వాత 'ఈ నగరానికి ఏమైంది'తో కొందరు కొత్తవాళ్లకు కెరీర్ ఇచ్చాడు. ఇప్పుడు 'కీడా కోలా'లోనూ ప్రతిభ ఉన్న కొత్త వాళ్లు కనిపిస్తున్నారు. తరుణ్‌కి తనపై, తన కథలపై చాలా నమ్మకం. ఈ విషయంలో అతన్ని గౌరవిస్తాను. ఇండస్ట్రీకి దొరికిన అదృష్టం తను'' అని హీరో విజయ్ దేవరకొండ అన్నారు. తరుణ్ భాస్కర్ దాస్యం దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'కీడా కోలా'. రానా సమర్పణలో కె. వివేక్ సుధాంషు, సాయికృష్ణ గద్వాల్, శ్రీనివాస్ కౌశిక్, శ్రీపాద్ నిర్మించిన ఈ చిత్రం నవంబర్ 3న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన విజయ్ దేవరకొండ మాట్లాడుతూ–''తరుణ్ భాస్కర్‌పై ఉన్న నమ్మకంతో చెబుతున్నా.. 'కీడా కోలా' మజా ఇస్తుంది. తర్వలో మా ఇద్దరి కాంబినేషన్‌లో మరో సినిమా వస్తుంది'' అన్నారు. సీనియర్ నటుడు బ్రహ్మానందం మాట్లాడుతూ–''డైరెక్టర్ జంధ్యాలగారి సినిమాలు చేస్తున్నప్పుడు వినోదం ఎంత హాయిగా పండిందో మళ్లీ 'కీడా కోలా'కి అలాంటి అనుభూతి కలిగింది'' అన్నారు. ''నా 'పెళ్ళి చూపులు, ఈ నగరానికి ఏమైంది' చిత్రాల విడుదలప్పుడు చిన్న భయం ఉండేది. ప్రేక్షకుల స్పందన తెలుసుకునేందుకు థియేటర్ బయటే తిరిగేవాడిని. 'కీడా కోలా' విషయంలో ఆ భయం లేదు'' అన్నారు తరుణ్ భాస్కర్. ''రెండు గంటల పాటు ప్రేక్షకులు నవ్వుతూనే ఉంటారు'' అన్నారు నిర్మాతలు సాయికృష్ణ గద్వాల్, శ్రీపాద్.

ప్రేక్షకులకు పది రెట్ల థ్రిల్ గ్యారంటీ - అనిల్ విశ్వనాథ్



''మా ఊరి పొలిమేర' తొలి భాగం ఓటీటీలో రిలీజ్ కావడంతో ప్రేక్షకుల స్పందన పెద్దగా తెలియలేదు. సినిమా చూసి, చాలామంది బాగుందని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. శుభలేఖ సుధాకర్‌గారు ఫోన్ చేసి, 'దర్శకుడిగా నీకు మంచి భవిష్యత్ ఉంటుంది' అని చెప్పడంతో నాపై నాకు మరింత నమ్మకం పెరిగింది'' అని డైరెక్టర్ డా. అనిల్ విశ్వనాథ్ అన్నారు. 'సత్యం' రాజేశ్, కామాక్షీ భాస్కర్ల, బాలాదిత్య, రాకేందు మౌళి ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'మా ఊరి పొలిమేర–2'. గౌరీకృష్ణ నిర్మించిన ఈ చిత్రం నవంబరు 3న రిలీజవుతోంది. ఈ సందర్భంగా అనిల్ విశ్వనాథ్ మాట్లాడుతూ– ''మా ఊరి పొలిమేర' ఎక్కడ ముగిసిందో అక్కడి నుంచే రెండో భాగం మొదలవుతుంది. తొలి భాగం హిట్టవ్వడంతో సీక్వెల్‌పై అంచనాలు పెరిగాయి. అందుకే పార్ట్ 2 స్క్రీన్‌ప్లేను మరింత బలంగా తయారు చేశాను. తొలి భాగంతో పోల్చితే ప్రేక్షకులు దాదాపు పది రెట్ల థ్రిల్ ఫీలవుతారు. వంశీ నందిపాటిగారి సహకారంతో మా చిత్రాన్ని ఘనంగా రిలీజ్ చేస్తున్నాం. 'బన్నీ' వాసుగారికి నచ్చడంతో మా సినిమా పెద్ద రేంజ్‌కు వెళ్లింది. 'మా ఊరి పొలిమేర 3' కూడా ఉంటుంది. అంతకన్నా ముందు వేరే జానర్‌లో ఓ సినిమా చేస్తా'' అన్నారు.

ప్రేమకథ షురూ



● నాగచైతన్య, అలేఖ్య హారిక, సంతోష్ శోభన్

సంతోష్ శోభన్, అలేఖ్య హారిక జంటగా కొత్త సినిమా షురూ అయింది. సుమన్ పాతూరి దర్శకత్వంలో అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్‌పై ఎస్‌కేఎన్, సాయి రాజేశ్ నిర్మిస్తున్న ఈ సినిమా సోమవారం ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి డైరెక్టర్ చందూ మొండేటి కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో నాగచైతన్య క్లాప్ కొట్టగా, డైరెక్టర్ వశిష్ఠ మల్లిడి దర్శకత్వం వహించారు. డైరెక్టర్ హరీష్ శంకర్, నిర్మాత రవిశంకర్ యూనిట్‌కి స్క్రిప్ట్ అందించగా, హీరో సుశాంత్, దర్శకులు హను రాఘవపూడి, రాహుల్ సంకృత్యాన్ యూనిట్‌కి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సంతోష్ శోభన్ మాట్లాడుతూ– ''ఈ సినిమాలో మంచి ప్రేమకథ ఉంటుంది'' అన్నారు. ''నా మనసుకు దగ్గరైన కథ ఇది. నేను, ఎస్‌కేఎన్, సందీప్ రాజ్, అలేఖ్య.. మేమంతా ఫ్రెండ్స్. ఈ సినిమా వారితో కలిసి చేస్తుండటంతో మరింత బాధ్యతగా భావిస్తున్నా'' అన్నారు సాయి రాజేశ్. ''ఈ సినిమాకు దర్శకత్వం వహించే చాన్స్ ఇచ్చిన నా ఫ్రెండ్ సాయి రాజేశ్‌కు థ్యాంక్స్'' అన్నారు సుమన్ పాతూరి. ''హీరోయిన్‌గా చేయాలనే నా కల ఈ చిత్రంతో నెరవేరుతోంది'' అన్నారు అలేఖ్య హారిక. ''తెలుగు అమ్మాయిలను ప్రోత్సహించాలనే నా సినిమాల్లో తెలుగు అమ్మాయిలనే హీరోయిన్‌గా తీసుకుంటున్నాను'' అన్నారు ఎస్‌కేఎన్. ఈ చిత్రానికి కెమెరా: అస్కర్, సంగీతం: విజయ్ బుల్గానిన్, సహనిర్మాతలు: ధీరజ్ మొగిలినేని, రమేశ్ పెద్దింటి.

ఒకేసారి ఐదు సినిమాలు ఒక సంచలనం - బ్రహ్మానందం



● అచ్యుతరావు, బ్రహ్మానందం, ఉపేంద్ర

''ఒక సినిమా తీయడానికే ఇబ్బంది పడుతున్న ఈ రోజుల్లో ఒకేసారి ఐదు సినిమాలు తీస్తుండటం ఓ సంచలనం. తన కుమారుడు ఉపేంద్రని హీరోగా పరిచయం చేయడంతో పాటు ఒకేసారి అతనితో ఐదు సినిమాలు తీస్తున్న అచ్యుతరావుకి అభినందనలు. దీనివల్ల పరిశ్రమను నమ్ముకున్నవారికి అవకాశాలు ఇచ్చి, భోజనం పెట్టినట్లవుతుంది. 'ఉపేంద్రగాడి అడ్డా' మంచి హిట్టవ్వాలి'' అని సీనియర్ నటుడు బ్రహ్మానందం అన్నారు. కంచర్ల ఉపేంద్ర, సావిత్రీ కృష్ణ జంటగా ఆర్యన్ సుభాన్ ఎస్‌కే దర్శకత్వం వహించిన చిత్రం 'ఉపేంద్రగాడి అడ్డా'. ఎస్ఎస్ఎల్ఎస్ క్రియేషన్స్‌పై కంచర్ల అచ్యుతరావు నిర్మించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకి బ్రహ్మానందం ముఖ్య అతిథిగా హాజరై, 'ఉపేంద్రగాడి అడ్డా' ట్రైలర్‌ను, '1920 భీమునిపట్నం' పోస్టర్‌ను విడుదల చేశారు. అలాగే ఉపేంద్ర హీరోగా ఇదే బ్యానర్‌లో తీస్తున్న ఐదు సినిమాల టీజర్లను విడుదల చేశారు. కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ– ''మా బ్యానర్‌లో నవంబర్ నుంచి ప్రతీ నెల ఒక సినిమాను విడుదల చేయబోతున్నాం'' అన్నారు. ''నా పుట్టిన రోజుకి ఇది వెలకట్టలేని పెద్ద బహుమతి'' అన్నారు కంచర్ల ఉపేంద్ర. ''సోషల్ మీడియా నేటి సమాజాన్ని ఎంతగా ప్రభావితం చేస్తోందో మా చిత్రం ద్వారా చూపిస్తున్నాం'' అన్నారు ఆర్యన్ సుభాన్ ఎస్‌కే. హీరోయిన్ సావిత్రీ కృష్ణ, సహనిర్మాతలు కంచర్ల సుబ్బలక్ష్మి, కంచర్ల సునీత పాల్గొన్నారు.

కథని నమ్మి చేశాం - శ్రీరామ్



● అవసరాల, ఖుషీ, శ్రీరామ్, సాయికిరణ్, కోన వెంకట్

''పిండం అనేది జననానికి, మరణానికి సంబంధించినది. ఈ 'పిండం' సాయి కిరణ్ లాంటి ప్రతిభగల దర్శకుడి పుట్టుకకు (ఇండస్ట్రీలో) కారణం కావాలని కోరుకుంటున్నాను'' అన్నారు రచయిత, నిర్మాత కోన వెంకట్. సాయికిరణ్ దైదా దర్శకత్వంలో శ్రీరామ్, ఖుషీ రవి జంటగా నటించిన చిత్రం 'పిండం'. 'ది స్కేరియస్ట్ ఫిల్మ్' ఉపశీర్షిక. కళాహి మీడియాపై యశ్వంత్ దగ్గుమాటి నిర్మించిన ఈ సినిమా టీజర్‌ని హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్నారు కోన వెంకట్. మరో అతిథి బీవీఎస్ రవి (రచయిత, దర్శకుడు) మాట్లాడుతూ– ''ఈ సినిమా టీజర్, నిర్మాణ విలువలు బాగున్నాయి. తప్పకుండా విజయం సాధిస్తుంది'' అన్నారు. శ్రీరామ్ మాట్లాడుతూ– ''కథని నమ్ముకొని చేసిన చిత్రం 'పిండం'. ఈ సినిమాలో భాగం కావడం సంతోషంగా ఉంది. ఈ చిత్రంలో నటించిన ఇద్దరు పిల్లల నటన చూసి నేనే ఆశ్చర్యపోయాను. ఇలాంటి మంచి సినిమాని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు. ''కళాహి మీడియా బ్యానర్‌పై 'పిండం'లాంటి మంచి సినిమాలు మరిన్ని చేస్తాం'' అన్నారు యశ్వంత్ దగ్గుమాటి. ''ఇదొక ఇంటెన్స్ హారర్ ఫిల్మ్'' అన్నారు సాయి కిరణ్ దైదా. సంగీత దర్శకుడు కృష్ణ సౌరభ్ సూరంపల్లి, కెమెరామేన్ సతీష్ మనోహర్ తదితరులు మాట్లాడారు.

అంబాజీపేట సంతృప్తి ఇచ్చింది - సుహాస్



● సుహాస్, శివానీ నాగరం

''అంబాజీపేట మ్యారేజి బ్యాండు' ఫ్రెష్ సబ్జెక్ట్. సినిమా కొత్తగా ఉంటుంది. నటుడిగా నాకు సంతృప్తినిచ్చింది. ఒక మంచి సినిమా చూశామనే అనుభూతితో ప్రేక్షకులు థియేటర్స్ నుంచి బయటకు వస్తారు'' అని సుహాస్ అన్నారు. దుశ్యంత్ కటికినేని దర్శకత్వంలో సుహాస్, శివానీ నాగరం జంటగా నటించిన చిత్రం 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు'. జీఏ2 పిక్చర్స్, మహాయన మోషన్ పిక్చర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్స్ నిర్మించాయి. ఈ చిత్ర సంగీతదర్శకుడు శేఖర్ చంద్ర స్వరపరచిన 'గుమ్మా....' అంటూ సాగే తొలి పాటను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా దుశ్యంత్ కటికినేని మాట్లాడుతూ– ''ఈ పాటకి రెహ్మాన్ మంచి లిరిక్స్ ఇచ్చారు. ఈ సినిమాలోని పాటలన్నీ బాగుంటాయి'' అన్నారు. ''జనవరి నెలాఖరులో సినిమాను విడుదల చేయాలనుకుంటున్నాం'' అన్నారు ధీరజ్ మొగిలినేని. ''మంచి సినిమాలు ఎప్పుడొచ్చినా ప్రేక్షకులు ఆదరిస్తారు. 'అంబాజీపేట..' హిట్ కావాలి'' అన్నారు నిర్మాత ఎస్‌కేఎన్. నటులు జగదీశ్, నితిన్, డ్యాన్స్ మాస్టర్ మోయిన్ తదితరులు మాట్లాడారు.